# తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అంతర్రాష్ట్ర ఆపరేషన్ - 27 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్



**శాసనసభ / హైదరాబాద్:** దేశంలో సైబర్ దాడులు పెరుగుతున్న క్రమంలో రాష్ట్రానికి చెందిన సైబర్ సెక్యూరిటీ టీమ్ అలర్ట్ అయ్యింది. ఈ మేరకు తొలిసారి అంతర్రాష్ట్ర ఆపరేషన్ నిర్వహించి, 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసింది. వారి నుంచి పెద్దమొత్తంలో నగదు సహా ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. ఆ వివరాలను రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. దక్షిణ ఆసియా దేశాలు సైబర్ నేరాలకు హబ్‌లా మారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. ఎటువంటి లింక్ క్లిక్ చేయవద్దని, ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ నేరస్తులపై పోలీసుల నిఘా పెరగడంతో సైబర్ నేరగాళ్లు నగరాలు వదిలి గ్రామాల నుంచి ఆపరేట్ చేస్తున్నారని ఆమె తెలిపారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మొదటిసారి అంతర్ రాష్ట్ర ఆపరేషన్ నిర్వహించిందని శిఖా గోయల్ వెల్లడించారు. రాజస్థాన్ ముఠా రాష్ట్రంలో భారీగా సైబర్ నేరాలకు పాల్పడిందని తెలిపారు. నిరుద్యోగులు, పేదలు, ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ఈ ఆపరేషన్‌లో వివిధ రూపాల్లో ఆర్థిక నేరాలకు పాల్పడిన 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ సైబర్ కేటుగాళ్ల కోసం 20 రోజుల పాటు నాలుగు బృందాలు గాలించి పట్టుకున్నారని తెలిపారు.తెలంగాణలో 189 కేసుల్లో రూ.9కోట్లు కాజేసిన రాజస్థాన్ ముఠా : నిందితులు తెలంగాణ రాష్ట్రంలో 189, దేశవ్యాప్తంగా 2,223 కేసుల్లో నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నమోదైన 189 కేసుల్లో రూ.9 కోట్లు కాజేశారని తెలిపారు. నిందితులు 29 ఫేక్ అకౌంట్‌లు తెరిచి, వాటి ద్వారా రూ.11.01 కోట్ల సైబర్ నేరాలకు పాల్పడ్డారని శిఖా గోయల్ చెప్పారు. అదేవిధంగా నిందితుల నుంచి 31 చరవాణిలు, 37 సిమ్ కార్డులు, 13 ఏటీఎమ్ కార్డులు, 7 చెక్‌బుక్స్, రెండు హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నామని ఆమె వివరించారు."ప్రజలు ఫోన్‌లకు వచ్చే అనుమానిత లింకులు తెరవద్దు. అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కొంతమంది కేటుగాళ్లు ఫేక్ అకౌంట్‌లు తెరిచి, కమిషన్ల కోసం కక్కుర్తిపడి కరెంట్ ఖాతాలు ఏవైతే యాక్టీవ్‌గా ఉంటాయే వాటిని టార్గెట్‌గా చేసుకొని, వారికి లింక్‌లు పంపటం లేదా ట్యాక్స్ హెచ్చరికలు చేస్తూ డబ్బులను గుంజుకోవడం జరుగుతుంది. అలాంటివాటిని నమ్మకుండా ఏవైనా స్పామ్‌గా అనిపిస్తే సైబర్ క్రైటంను సంప్రదించండి."–శిఖా గోయల్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్

## మూసి ప్రక్షాళనను అడ్డుకుంటే ప్రత్యేక ఉద్యమం చేస్తాం..

**శాసనసభ / హైదరాబాద్:** మానవత్వం ఉన్న మనుషులైతే మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇస్తారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మూసి నరకం నుంచి నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు.మూసి పరివాహక ప్రాంతాల్లో పండే పంటలో ఐరన్ ఎక్కువ అని ప్రియాంకా వర్గీస్ స్టడీ రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఓ వైపు ఫ్లోరిన్.. ఇంకో వైపు మూసి అంటూ మంత్రి తెలిపారు. నల్గొండ అంటే కేటీఆర్‌కు ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు.మల్లన్న సాగర్ లో పోలీసులను పెట్టి రైతులను ఎందుకు ఖాళీ చేయించారని ప్రశ్నించారు. దమ్ముంటే మూసి మీద చర్చకు రావాలన్నారు. అసెంబ్లీ లో చర్చ పెడతామన్నారు. మూసీపై కేటీఆర్, హరీష్ రీసెర్చ్ చేయాలన్నారు. మూసీ ప్రక్షాళనలో ప్రజలను ఒప్పిస్తామని, వారికి సాయం చేస్తామన్నారు. బాధిత కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూం ఇస్తామన్నారు.ప్రధాని మోడీని మూసికి నిధులు అడిగామని.. ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. తాను మూసి కోసం 11 రోజులు దీక్ష చేశానన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వచ్చి మూసి తెలంగాణకు మరణ కారణం అయ్యిందని అన్నారన్నారు. కేసీఆర్, హరీష్, కేటీఆర్.. నల్గొండ మీద కక్ష కట్టారన్నారు. అన్నీ రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మల్లన్న సాగర్‌లో 70 వేల ఎకరాలు ముంచారని.. 70 వేల కుటుంబాలను నీట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి డీపీ కూడా ఇవ్వలేదు అంటే.. కూ.లక్ష 50 వేల కోట్లు పెడుతున్నారు అంటున్నారని మండిపడ్డారు. మూసి ప్రక్షాళనను అడ్డుకుంటే ప్రత్యేక ఉద్యమం చేస్తామన్నారు. ఎన్ని కోట్లు అయినా మూసి పూర్తి చేయాల్సిందేనన్నారు. రజాకార్లతో కొట్లాడినట్టు కొట్లాడుతామన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## కేంద్రం వరద సాయం... ఏపీకి రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416 కోట్లు విడుదల

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మొత్తం 14 రాష్ట్రాలకు రూ.5,858.60 కోట్ల నిధులను విడుదల చేసింది. తెలంగాణకు రూ.416.80 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,036 కోట్లను విడుదల చేసింది. అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లను ఇచ్చింది.గుజరాత్‌కు రూ.600 కోట్లు, కేరళకు రూ.145.60 కోట్లను కేటాయించింది. రాష్ట్ర విపత్తు నిధికి ఎన్డీఆర్ఎఫ్ నుంచి కేంద్రం వాటాగా ఈ మేరకు నిధులను విడుదల చేసింది.ఇటీవల భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ, కేరళ సహా వరద ప్రభావిత రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాయి. వరదల వల్ల ఆయా రాష్ట్రాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తూ నివేదిక ఇచ్చాయి. దీంతో తక్షణ సాయంగా కేంద్ర హెూంశాఖ నిధులను మంజూరు చేసింది.

## హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం విధిస్తూ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం విధించినట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారితీస్తున్న డీజేలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు డయల్ 100కు ఫిర్యాదులు పెరిగాయి. ఈ క్రమంలో డీజేలపై నిషేధం విధిస్తూ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.నగర సీపీ సీవీ ఆనంద్ ఇటీవల డీజే అంశంపై బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ రూంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ సీవీ ఆనంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్ళుగా డీజేలతో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన సాగుతోందని అన్నారు.

# మూసీ నది ప్రక్షాళనలో మరో అడుగు - కూల్చివేతలు షురూ చేసిన అధికారులు



**శాసనసభ / హైదరాబాద్:** హైదరాబాద్ మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని మూసీ నదీ గర్భంలో నిర్వాసితుల ఇళ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. శంకర్‌నగర్‌లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వడంతో కొంతమంది స్వచ్ఛందంగా నివాసాలను ఖాళీ చేశారు. అలా ఖాళీ చేసిన వారి గృహాలను అధికారులు కూల్చివేస్తున్నారు. వీధులు ఇరుకుగా ఉండడంతో కూలీల సహాయంతో నివాసాలు నేలమట్టం చేస్తున్నారు. నిర్వాసితుల సామగ్రి తరలింపునకు రెవెన్యూ అధికారులు వాహనాలు ఏర్పాటు చేశారు. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. నదీ గర్భంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని చాదర్ ఘాట్, శంకర్ నగర్, వినాయక వీధి, రసూల్ పురా, మూసానగర్ ప్రాంతాల్లో నిర్వాసితుల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సుమారు 100 మంది అడ్డా కూలీల సహకారంతో సమ్మెట, గుణపాలతో అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడ్డారు. ఒక్కొక్క ఇంటిని పెకిలిస్తూ పోయారు. ఓవైపు కూల్చివేతలు కొనసాగుతుండగా మరోవైపు మార్కింగ్ చేసిన ఇళ్లలోని పలు కుటుంబాలు హుటాహుటినా సామగ్రిని సర్దుకొని వారికి కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లకు వెళ్లిపోయారు. కూల్చివేత ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు.మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం : హైదరాబాద్ మహానగరంలో మూసీ నది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. అందులో భాగంగా తొలి దశలో మూసీ నది గర్భంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించిన ప్రభుత్వం వారం రోజుల నుంచి సర్వే నిర్వహించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రవహించే మూసీ నది గర్భంలో సుమారు 2 వేలకుపైగా నిర్మాణాలున్నట్లు గుర్తించి అందులో నివసిస్తున్న కుటుంబాలను ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించింది. పునరావాసం కల్పిస్తామని భరోసా : ఈ మేరకు రంగంలోకి దిగిన అధికారులు నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి బాధిత కుటుంబాలకు జీహెచ్ఎంసీ పరిధిలోనే పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. నగరంలోని 14 చోట్ల రెండు పడకల గదుల గృహా సముదాయాల్లో ఖాళీగా ఉన్న వాటిని కేటాయించి నిర్వాసితులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అధికారుల సూచనలతో నదీ గర్భంలో ఇబ్బందికరమైన పరిస్థితుల్లో జీవిస్తున్న పలు కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇళ్లను ఖాళీ చేశాయి. అందులో కొంత మంది ఖాళీ చేసి వెళ్లిపోవడంతో మలక్ పేట ఎమ్మెల్యే బలాల సహకారంతో సుమారు 100 మంది కూలీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అక్కడే ఉన్న పోలీసులు ఇదే అదనపుగా భావించి ఖాళీ చేసిన నివాసాల్లోని ఇనుప దర్వాజలు, తలుపులు, కిటికీలు, విద్యుత్ సామాగ్రిని తమ వ్యక్తిగత వాహనాల్లో తరలించడం గమనార్హం. కూల్చివేతల ప్రాంతాల్లో ఎలాంటి ఆటంకం లేకుండా పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పర్యవేక్షించారు. శిథిలాలను తొలగించి ఆ భూములను చదును చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## రోడ్లపై ఉన్న ఆలయాలు, దర్గాలు, గురుద్వారాలు తొలగించాల్సిందే: సుప్రీంకోర్టు

ప్రజల భద్రతే ముఖ్యం తప్ప మత విశ్వాసాలు కాదని దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. భారతదేశం లౌకిక దేశమని గుర్తుచేస్తూ రోడ్లను ఆక్రమించిన ఆలయాలు, దర్గాలు, గురుద్వారాలు.. ఏ మతానికి చెందిన కట్టడాలైనా సరే తొలగించాల్సిందేనని తేల్చిచెప్పింది. ప్రజల భద్రత విషయంలో రాజీ ధోరణి ఎట్టి పరిస్థితుల్లోనూ కూడదని వివరించింది. ఈమేరకు బుల్డోజర్ జస్టిస్ కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం ఈ వ్యాఖ్యలు చేసింది.ఏదైనా నేరానికి పాల్పడిన వ్యక్తుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందనే ఆరోపణలు ఇటీవల పెరిగాయి. అత్యాచారం, హత్య కేసులలో నిందితుల ఇంటిపైకి బుల్డోజర్లను పంపిస్తోందని పలు రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు వినిపిస్తున్నాయి. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. నేరం జరిగిన ఒకటి రెండు రోజుల్లో పలు కారణాలు చూపిస్తూ నిందితుల ఇళ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. ఇది 'బుల్డోజర్ జస్టిస్' అంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరుగుతోంది. దీనిని కోర్టులు ఆక్షేపించాయి. ఒకవేళ నిందితుడు నేరానికి పాల్పడినా సరే ఇంటిని కూల్చడం సరికాదని వ్యాఖ్యానించాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. బుల్డోజర్ జస్టిస్ ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ విచారించారు.రాష్ట్ర ప్రభుత్వాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఒకటీ రెండు సంఘటనల ఆధారంగా న్యాయస్థానం ఓ అంచనాకు రావద్దని కోరారు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి ముందుగా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ కట్టడాలని తేల్చాక నోటీసులు ఇచ్చి కూల్చివేస్తున్నట్లు వివరించారు. ఏదో ఒక ఘటననో, ఓ వర్గం వారి ఆరోపణలతోనో కూల్చివేతలు అక్రమమని భావించవద్దని కోరారు. దీనిపై స్పందించిన సుప్రీం బెంచ్... మనది లౌకిక దేశమని గుర్తుచేస్తూ మత విశ్వాసాలకన్నా ప్రజల భద్రతే ముఖ్యమని గతంలోనూ పలు తీర్పుల్లో స్పష్టం చేసినట్లు తెలిపింది. రోడ్లపై ఉన్న మతపరమైన కట్టడాలను తొలగింపును కోర్టు సమర్థించిందని గుర్తుచేసింది. నిందితుల ఇళ్ల కూల్చివేత విషయంలోనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, ఆక్రమణల తొలగింపు చట్టప్రకారమే జరగాలన్నదే ధర్మాసనం అభిప్రాయమని పేర్కొంది.

## హైదరబాద్‌లో భారీగా హవాలా మనీ - రూ. 1.21 కోట్ల నగదు సీజ్

హైదరాబాద్ నగరంలోని సుల్తాన్‌బజార్‌లో భారీ మొత్తంలో హవాలా డబ్బు పట్టుబడింది. వాహన తనిఖీలలో రూ.1.21 కోట్ల నగదును పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. ఈ హవాలా డబ్బు తరలిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.హైదరాబాద్ సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హవాలా డబ్బు పట్టుపడింది. వాహన తనిఖీలలో రూ.1 కోటి 21 లక్షలు పట్టుబడింది. సుల్తాన్ బజార్ పోలీసులు మంగళవారం సాయంత్రం బొగ్గులకుంటలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఆ సమయంలో అటుగా బైక్ పై వస్తున్న ఇద్దరిని పోలీసులు ఆపేందుకు యత్నించారు. వారు పోలీసులను తప్పించుకొని పోవడంతో కోఠి హనుమాన్ టెక్డి వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు.రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ (27), వసంత్ ( 24) లు అనుమానాస్పదంగా, ఓ బ్యాగ్‌ను తరలిస్తుండటం గమనించారు. ఆ బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో కోటి రూపాయల నగదు పట్టుబడింది. వారిని విచారించగా, తమకు ఆ డబ్బుతో ఎలాంటి సంబంధం లేదని తన ప్రతినిధి ఆదేశాల మేరకు డబ్బులను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వారి ఇచ్చిన సమాచారంతో హనుమాన్ వ్యాయామశాల వద్ద ఉన్న ఓ అపార్ట్మెంట్‌లో తనిఖీ చేయగా, అక్కడ రూ.21 లక్షలు పట్టుబడ్డాయి. అక్కడ ఉన్న మరోవ్యక్తి తరుణ్‌ను విచారించగా, ముంబయిలో ఉండే బబ్లూ అనే హవాలా వ్యాపారి ఆదేశాల అనుసారంగా, తాము పని చేస్తున్నామని తరుణ్ తెలిపాడు.నగరంలో ఉండే వ్యాపారుల నుంచి ఈ లావాదేవీలు సాగిస్తున్నట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు. హవాలా డబ్బు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1.21 కోట్ల నగదు సీజ్ చేసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు బబ్లూను త్వరలో అరెస్ట్ చేస్తామని డీసీపీ వివరించారు.

## పోలీస్ స్టేషన్‌లో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు వెళ్లిన అతిశీ..అడ్డుకున్న పోలీసులు

పోలీసుల అదుపులో ఉన్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కలిసేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. వాంగ్‌చుక్‌ను కలిసేందుకు వెళ్లిన ఢిల్లీ సీఎంను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.సోనమ్ వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ గత నెల 1న లేహ్‌లో పాదయాత్రను ప్రారంభించారు. లఢక్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించడానికి ఇది చట్టాన్ని రూపొందించే అధికారం ఇస్తుందని అంటున్నారు. ఈ డిమాండ్లతో పాదయాత్ర ప్రారంభించిన సోమ్ వాంగ్‌చుక్‌ను, పలువురు అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు ముఖ్యమంత్రి అతిశీ బవానా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కానీ ఆమెను పోలీసులు అడ్డుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## బుల్డోజర్ రాజకీయాలపై ప్రజల గళం రాహుల్ గాంధీకి వినిపించడం లేదా? : కేటీఆర్

సదరు వీడియోను ఎక్స్‌లో పొందుపర్చారు. రాహుల్ గాంధీ ప్రజలకు ఇచ్చిన మాటపై నిలబడి తెలంగాణకు వచ్చి మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలను కలవాలని కేటీఆర్ సూచించారు.ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న సీఎం : అటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపైనా కేటీఆర్ మండిపడ్డారు. ఒకటి కాదు, రెండు కాదు, మూడు కాదు, 23 సార్లు హైద్రాబాద్– సికింద్రాబాద్‌కు తిరిగినట్టు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్న సీఎంకు తెలంగాణ గల్లీల్లో తిరిగి చూసే ఓపిక లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఐదు లక్షల మంది రైతన్నలు రెండు లక్షల రూపాయల లక్షల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని, 67 లక్షల మందికి పైగా రైతన్నలు రైతుబంధు కోసం కండ్లు కాయలు గాసేలా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో 43 లక్షల మంది పత్తిరైతులు దళారుల చేతిలో దగా అయ్యి అల్లాడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేక పాలన పుణ్యమా అని ఈ దసరా తెలంగాణ ప్రజలకు దసరాలాగా లేకుండా పోయిందని మండిపడ్డారు.మరోవైపు కేటీఆర్ ఇవాళ మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పరిధిలోని గోల్నాక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ఎప్పుడు ఇళ్లు కూల్చుతారో అని ప్రజలు ఆవేదనలో ఉన్నారని, హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారని దుయ్యబట్టారు. మూసీమే లూటో.. ఢిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని దుయ్యబట్టారు.రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని, మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని కేటీఆర్ ఆక్షేపించారు. మీ ఇళ్ల వద్దకు బుల్డోజర్ వస్తే కంచె అడ్డుపెట్టాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కడతామంటూ కూల్చుతున్నారని, పేదల ఇళ్లు కూల్చుతుంటే మీ ప్రాంత ఎంపీ కిషన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడబలుక్కున్నారా? అని మండిపడ్డారు.

## హైదరాబాద్ నగరవాసులను వణికిస్తున్న ఆర్బీ-ఎక్స్ గుర్తు




**శాసనసభ / హైదరాబాద్:** హైదరాబాద్ నగరవాసులు ప్రస్తుతం బుల్డోజర్ శబ్దం విన్నా.. కాలనీల్లో జేసీబీలను చూసినా వణికిపోతున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలకు సమీపంలో ఉండే ఇళ్ల యజమానులకైతే నిద్ర కూడా పట్టటం లేదు.చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుండటంతో వారి గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. తాజాగా.. నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారికి కొత్త భయం పట్టుకుంది. ఆర్బీ–ఎక్స్ గుర్తు చూస్తే చాలా ఆయా ప్రాంతాల్లోని నగరవాసులు వణికిపోతున్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ఆ పార్టీ నేతలే మరిచిపోతున్నారు: శ్రీధర్ బాబు

మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారని గుర్తు చేశారు. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని కేటీఆర్ 2021లో ఆదేశించారని, నిర్వాసితుల పరిహారంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ప్రజలకు శుభ్రమైన గాలి, నీరు అందించాలని నాటి ప్రభుత్వం ఆలోచించిందని భావించామని, ఇప్పుడు తాము కూడా అలాగే అనుకుంటున్నామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైనదని, దానిని బీఆర్ఎస్ నేతలు మరింత సంక్లిష్టంగా మార్చుతున్నారని ఆరోపించారు.మల్లన్నసాగర్ నిర్వాసితులను ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారో మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కనీసం వారు ఆర్ అండ్ ఆర్ కూడా ఇవ్వకుండా బలవంతంగా వెళ్లగొట్టారన్నారు. కానీ తాము మూసీ నిర్వాసితులకు ఇళు ఇస్తున్నామని వెల్లడించారు. ఉపాధి చర్యలు కూడా చేపట్టామన్నారు. అందరితో చర్చించి ముందుకు వెళుతుంటే బురద జల్లడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గతంలో నిలిచిన కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ పై హెూంమంత్రి అనిత ప్రకటన...

ఇది సంతోషకరమైన వార్త అంటూ మంత్రి లోకేశ్ స్పందన 2023 జనవరిలో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించగా... 95,208 మంది ఉత్తీర్ణులయ్యారు. అయితే ఆ తర్వాత నిర్వహించాల్సిన పీఎంటీ, పీఈటీ దశలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వల్ల బ్రేక్ పడింది.కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇది గుడ్ న్యూస్: మంత్రి నారా లోకేశ్ కాగా, కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ ప్రక్రియ మళ్లీ ప్రారంభిస్తామని హెూంమంత్రి అనిత ప్రకటించడంపై ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.దీనిపై ఆయన ప్రకటన విడుదల చేశారు."అర్ధాంతరంగా నిలిపివేసిన కానిస్టేబుల్ నియామక పరీక్ష ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తున్నామని ప్రకటించిన హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత గారికి ధన్యవాదాలు. ప్రిలిమినరీ పరీక్ష తరువాత రిక్రూట్ మెంట్ రెండవ దశలో జరగాల్సిన శారీరక దారుఢ్య పరీక్షలు వేర్వేరు కారణాలతో వాయిదా పడటం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను ప్రజాదర్బాం కు వచ్చిన నిరుద్యోగులు నా దృష్టికి తీసుకొచ్చారు. వీరి వినతిని పరిశీలించాలని హెూం మంత్రి గారికి పంపగా, వారు సానుకూలంగా స్పందించి రిక్రూట్ మెంట్ ప్రక్రియలో తరువాత దశలు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇది కానిస్టేబుల్ అర్హత పరీక్ష పాసైన నిరుద్యోగులకు చాలా సంతోషకరమైన సమాచారం" అని నారా లోకేశ్ ప్రకటించారు.

## 'ప్రభుత్వానికి సహకరించకపోగా అనవసర విమర్శలు' : బీఆర్ఎస్ తీరుపై తుమ్మల మండిపాటు

నిద్రలో వచ్చే కలలు ఊహించుకుని ప్రజలు, రైతులకు చెప్పి ఆందోళనకు గురిచేయాలన్న బీజేపీ ప్రయత్నం విఫలమైందని ఆక్షేపించారు. కేంద్రంలో బీజేపీ సర్కారు విధానాలు నిరసిస్తూ రైతులు రాజధాని ఢిల్లీ చుట్టుప్రక్కల రోడ్డు ఎక్కితే పట్టించుకోలేదని విమర్శించారు. నల్ల చట్టాలు రద్దు చేయాలని వర్షంలో తడుస్తూ ఎండలో ఎండుతూ అన్నదాతలు ఆందోళన చేసినా బీజేపీ కనికరం చూపలేదని దుయ్యబట్టారు. చివరకు సుప్రీంకోర్టు తాఖీదులతో కేంద్రం వెనక్కి తగ్గిందని తెలిపారు. ఆ తర్వాత కనీసం బాధిత రైతులను పరామర్శించలేదని మండిపడ్డారు."రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన మా ప్రభుత్వం పనిలోనే ఉంది. ఇప్పటి వరకు 22 లక్షల ఖాతాల్లో నగదు జమచేశాము. 18 వేల కోట్లు నగదు జమ చేశాము. బీజేపీ వారు తప్పుడు స్థలంలో ధర్నా మొదలుపెట్టారు. మీ రాజకీయ స్వలాభం కోసం రైతులను పావులుగా వాడుకోవద్దని ఆ పార్టీవారికి(బీజేపీ) విజ్ఞప్తి చేస్తున్నాను. కొద్ది రోజుల్లోనే రేషన్ కార్డు లేనటువంటి రుణమాఫీకి అర్హులైన రైతుల ఖాతాల వివరాలు కూడా మాకు అందుతాయి. వారికి కూడా రుణమాఫీ చేస్తాము"– తుమ్మల నాగేశ్వర రావు, మంత్రిబీజేపీ హామీలు ఏమయ్యాయ్ : రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న మోదీ సర్కారు అన్నదాతలను దగా చేసిందని తుమ్మల నాగేశ్వర రావు మండిపడ్డారు. కేంద్రంలో మూడోసారి గెలిచినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర రైతులు రూ.2.5లక్షల కోట్లు నష్టపోయారన్నారు. తప్పుడు స్థలంలో బీజేపీ ధర్నా చేస్తుందని అభిప్రాయపడ్డారు.రైతు కుటుంబాలకు రుణవిముక్తి చేయడమే లక్ష్యం : ఇప్పటి వరకు రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామన్న తుమ్మల ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. కేవలం 26 రోజుల్లోనే రూ.22 వేల మంది రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేశామన్నారు. ఇప్పటి దాకా 3.5 లక్షల కుటుంబాల సర్వే పూర్తైందని రూ. 2 లక్షల పైగా రుణాలు సంబంధించి త్వరలో షెడ్యూల్డ్ ప్రకటిస్తామని తెలిపారు. రైతు కుటుంబాలను రుణ విముక్తి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

శాసనసభ
బుధవారం 02 అక్టోబర్ - 2024

## బతుకమ్మ వేడుకల షెడ్యూల్ విడుదల



**శాసనసభ /హైదరాబాద్ :** బతుకమ్మ వేడుకల షెడ్యూల్ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. రేపటి (బుధవారం) నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బతుకమ్మ వేడుకలను ప్రభుత్వం నిర్వహించనుంది. 10న ట్యాంక్‌బాండ్‌లో బతుకమ్మ వేడుకలు..లేజర్‌షో జరగనుంది. అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్ బండ్‌వరకు వెయ్యి బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించనున్నారు. ఇక.. బతుకమ్మ వేడుకలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరుకానున్నారు. తెలంగాణ ఆడబిడ్డలందరికీ సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శు భాకాంక్షలు తెలిపారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. ఈ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనం అన్నారు. ఎంగిలిపూల నుంచి సద్దుల వరకూ అందరూ కలిసి పండుగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని గౌరమ్మను సీఎం ప్రార్థించారు.

## డిజిటల్ కార్డుల సర్వేను పక్కాగా నిర్వహించాలి



**భువనగిరి (కలెక్టరే ట్) శాసనసభ / అక్టోబరు 1:** ఈ నెల 3నుంచి రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పక్కాగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఫ్యామి లీ డిజిటల్ కార్డుల సర్వే నగరాలు, పట్టణ ప్రాంతాల విస్తరణకై ప్రతిపాదనలు, భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కారం, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుకోసం లబ్ధిదారుల ఎంపిక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతి కుమారి సమీక్షించారు. డిజిటల్ కార్డుల జారీకి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రెండు గ్రామాల్లో ప్రయోగాత్మక సర్వేను నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజకవర్గాలయితే రెండు వార్డులు, లేదా డివిజన్లు ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి ప్రతీ కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి ఈ నెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పి ఈ నెల 15వ తేదీ నాటికి ప్రతీ మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ వర్తింపజేసి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్లు కె.గంగాధర్, పి.బెన్‌షాలోమ్, ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీపీవో సునంద, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విద్యాసంస్థలకు సెలవులు



**శాసనసభ / కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, అక్టోబరు 1:** రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. అక్టోబరు 2 గాంధీ జయంతి సెలవు కావడంతో 3వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ఇచ్చింది. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులు సంతోషంగా వారివారి సొంతూళ్లకు వెళ్లారు. దీనితో నగరంలోని స్కూల్స్, కాలేజీలతోపాటు హాస్టళ్లన్నీ ఖాళీ అయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్లన్నీ విద్యార్థులతో కిటకిటలాడాయి. వరుస సెలవులు రావడంతో గ్రామాలకు వెళ్ళే విద్యార్థులు రెండురోజులుగా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను, ఇతర అలంకార వస్తువులను కొనుగోలు చేయడంతో దుకాణాలన్నీ కిక్కిరిసి పోయాయి. మంగళవారం సాయంత్రం వరకు విద్యార్థులంతా గ్రామాలకు వెళ్ళడంతో జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు బోసి పోయాయి. కిక్కిరిసిన కరీంనగర్ బస్టాండ్ కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ మంగళవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని ప్రయాణికులు తమ సొంత గ్రామాలకు చేరుకునేందుకు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగాణానికి చేరుకున్నారు. కరీంనగర్ బస్టాండ్‌లోని అన్ని ఫ్లాట్ ఫాంలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలతోపాటు, నగరాలకు సైతం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు బారులు తీరారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్, గోదావరిఖని, వరంగల్, నిజాబాద్, మంచిర్యాల, జగిత్యాల వైపు వెళ్లేందుకు బస్సుల కోసం ఫ్లాట్‌ఫాం వద్ద పెద్ద ఎత్తున ప్రయాణికులు వేచి చూశారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

## 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం
## హోంగార్డ్ గోపాల్ కుటుంబాన్ని సర్కార్ ఆదుకోవాలి'



**శాసనసభ /హైదరాబాద్ :** మల్కాపూర్ కూల్చివేత ఘటనలో గాయపడిన హోంగార్డు గోపాల్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. కనీస జాగ్రత్తలు పాటించనందున, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. హోంగార్డు చికిత్సకు కనీసం ప్రభుత్వం వైద్య ఖర్చులు కూడా భరించట్లేదని అన్నారు. గోపాల్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో హైడ్రా కూల్చివేతల్లో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డ్ గోపాల్‌ను ఇప్పటి వరకు పోలీస్ అధికారులెవ్వరూ పరామర్శించలేదని, ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా ఒక్క పోలీస్ ఉన్నతాధికారి కూడా అతన్ని ఎందుకు పరామర్శించలేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. హోంగార్డ్‌లు అంటే అధికారులకు చులకనగా ఉందన్నారు. విధి నిర్వాహణలో గాయపడిన గోపాల్‌కు ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటి వరకు హోంగార్డ్ గోపాల్ కుటుంబం చికిత్సకు రూ.లక్ష వరకు ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వం నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని గోపాల్ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. నాలుగు నెలల నుంచి జీతం రాక, ఇటు వైద్య ఖర్చులు భరించలేక పోతున్నామని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాజీ మంత్రి తెలిపారు. గోపాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం : ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్లు జరిపినప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం కారణంగానే గోపాల్ ప్రమాదానికి గురి అయ్యారని, అధికారులు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. గోపాల్‌కు పూర్తిగా నయం అయ్యేంత వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, అతనికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హైడ్రా కూల్చివేతలో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న హోంగార్డ్ గోపాల్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఇంతకీ ఏమి జరిగిందంటే : రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతల పర్వం జోరుగా కొనసాగుతూ హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డిలో పలుచోట్ల అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలోనే సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువు మధ్యలో అక్రమంగా నిర్మించిన ఇంటిని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చేశారు. చెరువు నీటి మధ్యలో కట్టిన బిల్డింగ్‌ను బ్లాస్టింగ్ చేసే క్రమంలో బిల్డింగ్ శకలాలు ఎగిరిపడి హోంగార్డు గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించి, వైద్యం అందించిన విషయం తెలిసిందే.

## జైల్‌లోని మిత్రుడిని కలిసేందుకు వచ్చి మృత్యువు ఒడిలోకి
## ఒకరి మృతదేహం లభ్యం



**శాసనసభ /హైదరాబాద్ :** ఖమ్మం నగరంలో దానవాయిగూడెం సమీపంలోని సాగర్ కాలువలో నలుగురు వ్యక్తులు గల్లంతు అయ్యారు. వీరిలో ఒక యువకుడి మృతదేహం లభ్యం అయ్యింది మిగిలిన ముగ్గురు కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాలకు వెళ్ళితే మణుగూరు పట్టణానికి చెందిన రాము అనే వ్యక్తి ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రాముకు పరిచయస్తులైన మణుగూరు పట్టణంలో బాపన కుంట చెం దిన నలుగురు రొండ వెంకటేశ్వర్లు (33), చల్లా రమేష్ (38), ప్రసా ద్(27), బండారు భరత్ (30) సోమవారం మధ్యాహ్నం ములాఖత్ పై చూసేందుకు జిల్లా జైల్ వద్దకు ఆటోలో వచ్చారు. అతనిని చూసి మాట్లాడిన అనంతరం ఖమ్మం నగరంలో ప్రకాశ్ నగర్ లో నివాసం ఉంటున్న రొండ వెంకటేశ్వర్లు బంధువు పిట్టల శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించారు. సోమవారం అర్ధరాత్రి దానవాయిగూడెం లో ఉన్న చల్ల రమేష్ అన్న కుమారుడు శ్రీహరి ఇంటి కి వచ్చారు. అక్కడ కూడా మద్యం సేవించారుఅనంతరం ఇంటికి వెళు తున్నామని చెప్పి బయలుదేరి దానవాయిగూడెం ఎన్ఎస్పీ కెనాల్ వద్దకు చేరుకున్నారు. కాల్వకట్ట పక్కన ఆటో ను నిలిపారు. రొండ వెంకటేశ్వ ర్లు ఆటోలో నిద్రిస్తుండగా మిగిలిన ముగ్గురు చల్లా రమేష్, ప్రసాద్, బం డారు భరత్ మెట్లెక్కి కాల్వపైకి వెళ్లారు. స్నానం చేసేందుకు కాల్వలో దిగారు. మద్యంమత్తులో ముగ్గురు కొట్టుకొని పోయారు. . ఖమ్మం టౌన్ ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో గజ ఇతగాళ్లతో గాలింపు చేపట్టగా బండారు భరత్ మృతదేహం లభించింది.

## బీజేపీ, బీఆర్ఎస్ మధ్య కుర్చీల కొట్లాట: మంత్రి తుమ్మల



**శాసనసభ /హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య కుర్చీల కొట్లాట జరుగుతోందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. బీఆర్ఎస్ అధికారంలో ఉంటే ఒకలా..లేకుంటే మరోలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దశలవారీగా మూసీ అభివృద్ధి జరుగుతుందంటూ కామెంట్స్ చేశారు. మంత్రి తుమ్మల మంగళవారం మీడియా చిట్‌చాట్‌లో భాగంగా బీజేపీ, బీఆర్ఎస్ మధ్య కుర్చీల కొట్లాట జరుగుతోంది. మీ కుర్చీల కొట్లాట మధ్యలోకి మమ్మల్ని ఎందుకు లాగుతారు. బీజేపీ అధ్యక్షుడిగా ఈటల అయినా మరెవరినైనా పెట్టుకోండి అంతేకానీ మీ గురించి మాకెందుకు?. నన్ను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. నేను ఎక్కడ ఉంటే అక్కడ మంత్రిని అవుతాను. గత ప్రభుత్వంలో కూడా నేను ఉన్నాను. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు పెట్టారు అనేది నాకు తెలుసు. మూసీ ప్రక్షాళన చెయ్యడానికే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మూసీ రివర్ ఫ్రంట్ పెట్టారు కదా?. మూసీ ప్రక్షాళన చెయ్యకుండా.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తా అనుకున్నారు?. బీఆర్ఎస్ నేతలకు కుర్చీ ఉంటే ఒకలా?.. కుర్చీ పోతే మరోలా మాటలు మాట్లాడుతున్నారు. ఇలా మాట్లాడం కరెక్ట్ కాదు. మా ప్రభుత్వం మూసీ ప్రక్షాళన డీపీఆర్‌ను నేను ఇంకా చూడలేదు. దశలవారీగా మూసీ అభివృద్ధి జరుగుతుంది అంటూ కామెంట్స్ చేశారు. మరోవైపు.. గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్ మంచి చేయడం బీఆర్ఎస్‌కు ఇష్టం లేదా?. 28 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేసాం.. కొందరివి ఆగిపోతే హరీష్ రావు పెడబొబ్బలు పెడుతున్నారు. జగదీష్ రెడ్డి ఖబడ్దార్.. మూసీ నది పరిహావాక ప్రాంతంలో తిరిగితే బడితె పూజే. నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రతినిధులను.. మూసీ పరివాహక ప్రాంత రైతులు చెట్లకు కట్టేయండి. ప్రభుత్వం మూసీ నదిని బాగుచేస్తుంటే కేటీఆర్, హరీష్ రావులు అడ్డు పడుతున్నారు. డబ్బులు ఇచ్చి యూట్యూబ్ ఛానల్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీ కింద నల్లగొండ జిల్లాలో లక్షల ఎకరాల భూమి సాగుచేస్తున్నారు. కానీ, మురికి నీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతగాని దద్దమ్మలు బీఆర్ఎస్ నేతలు. బీఆర్ఎస్ హాయాంలో మూసీ అభివృద్ధికి చేసింది ఏంటి?. బఫర్ జోన్‌లో ఇళ్ళు లేని వారి వీడియోలు తీసి ప్రభుత్వాన్ని తిట్టిస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవాలని బీఆర్ఎస్ చూస్తోంది. హైదరాబాద్ పరిధిలో వరదలకు కబ్జాలే కారణం. కబ్జాలకు బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తోంది. హరీష్‌రావు అగ్గిపెట్టె పట్టుకుని తిరుగుతున్నాడు. ఆయన ఎవరిని బలి తీసుకుంటాడో అని భయపడుతున్నాం' అంటూ కామెంట్స్ చేశారు.

## పెరిగిన వంటగ్యాస్ సిలిండర్ ధరలు



**శాసనసభ / ఢిల్లీ:** చమురు మార్కెటింగ్ కంపెనీలు మరోసారి ధరలు పెంచాయి. దసరా, దీపావళి పండుగలకు ముందు వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరను పెంచుతున్నట్లు ప్రకటించాయి. మంగళవారం 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరను రూ.48.50 పెంచాయి. అక్టోబరు 1 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని తెలిపాయి. అలాగే 5-కిలోల ఉచిత వాణిజ్య LPG సిలిండర్ల ధర రూ. 12 పెరిగింది. తాజా పెంపుతో ఢిల్లీలో 19 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,740కు చేరుకుంది. ఇంతకుముందు రూ.1,691.50 ఉన్నది. గత సెప్టెంబర్ 1న కూడా చమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్‌ల ధరను రూ.39 పెంచిన సంగతి తెలిసిందే. కాగా, 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,967 ఉండగా.. డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.855గా ఉంది.

## మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి



**శాసనసభ / కళ్యాణ్‌నగర్, అక్టోబరు 1:** మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో పెద్దపల్లి 3వ జిల్లా మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండావిష్కరణ చేసి మల్లు స్వరాజ్యం, సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఎన్ని ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చినా మహిళపై, యువతులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళల రక్షణ కోసం దాడులను సంఘటితంగా ఎదుర్కొవాలని, ఇండ్ల స్థలాల సాధన కోసం ఐద్వా ముందుంటుందని పేర్కొన్నారు. మహిళల సమస్యలపై ఐద్వా పోరాటలు నిర్వహిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో మహిళల హక్కులు, రక్షణ, దాడులపై సమావేశంలో తీర్మానాలు చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు అనుముల మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో మల్లు లక్ష్మితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కులవృత్తుల నుంచి కార్పొరేట్ రంగాన్ని తొలగించాలి



**శాసనసభ / షాద్‌నగర్, అక్టోబరు 1:** కుల వృత్తుల్లో కార్పొరేట్ రంగాన్ని నిర్మూలించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. బీసీ, ఎంబీసీల జీవనోపాధికి ఎంఎసఎంఈ 2024 పాలసీ సవరణలో బీసీలు, మహిళలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బీసీల ఆర్థిక స్వాలంబనకు ప్రణాళిక రూపొందించి ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ఫెడరేషన్లు నామ్‌కే వాస్తేగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఎంఎసఈఎం సమావేశానికి ఎమ్మెల్యేను ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వం ఆహ్వానించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవృత్తుల్లోకి కార్పొరేట్ రంగం రావడంతో బీసీల బతుకులు రోడ్డున పడుతున్నాయన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, వాటిని ఇతర అవసరాలకు దారిమళ్లించడం తప్ప పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. క్షౌరశాలలు, రజక వృత్తిలోకి కూడా కార్పొరేట్ కంపెనీలు రావడంతో నాయీ బ్రాహ్మణులు, రజకులు రోడ్డున పడ్డారన్నారు. పేదల పథకాలు, నిధులను బ్యూరోక్రాట్లు కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ, పేదల బతుకులతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. వడ్డెర వృత్తిలోకి కూడా కార్పొరేట్ రంగానికి ఎలా అనుమతులిస్తున్నారని ఉన్నతాధికారులను ఆయన ప్రశ్నించారు. మూసీ మాస్టర్ ప్లాన్‌లో రజకులకు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. కుల వృత్తులతో జీవిస్తున్న బీసీ, ఎంబీసీల బతుకులు ఆగమ్యగోచరంగానే మారాయాని, వారి సంక్షేమానికి కేటాయించిన నిధులను వారికే వెచ్చించాలని ఎమ్మెల్యే కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది బుల్‌డోజర్ పాలన




**శాసనసభ / నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 1 :** రాష్ట్రంలో, నియో జకవర్గంలో అభివృద్ధిని మరిచి పేద, మధ్య తరగతి ప్రజలు జీవితాలను చిన్నాభిన్నం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బుల్‌డోజర్ పాలన నడిపిస్తోందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనా ర్ధన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలవుతున్నా చేసిందేమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం ప్రజలను దృష్టిని మళ్లించేందుకు హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తూ కమర్షియల్ డ్రామాలకు తెర లేపిందని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అనుభవం లేని నాయ కుల పాలనలో అధికారులతో సమన్వయం కరువై అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. నియోజకవర్గంలో పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. తాను చేసిన పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం తప్పితే వారు చేసిందేమీ లేదని విమర్శించారు. చైర్మన్, వైస్ చైర్మన్ లేకుండానే మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి నిధులను దుర్వినియోగం చేశారని, దీనిపై తాము కోర్టుకు వెళ్లేం దుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక
బుధవారం 02 అక్టోబర్ - 2024

# నిలకడగా రజనీ ఆరోగ్యం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అనారోగ్యానికి లోనయ్యారు అనే వార్త దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులను కలవరానికి గురిచేసింది. సోషల్ మీడియా ద్వారా రజనీ కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్టులు కూడా పెడుతున్నారు. సోమవారం రాత్రి తీవ్ర కడుపునొప్పితో రజనీ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు హృదయ నాళంలో సమస్యను గుర్తించి, రజనీకి స్టెంట్ వేశారు. మంగళవారం ఉదయం ఆస్పత్రి వర్గాలు రజనీకాంత్ ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ని విడుదల చేశాయి. హృదయ నాళానికి సంబంధించిన చికిత్స చేసినట్టు ఈ బులెటిన్‌లో వారు వెల్లడించారు. రజనీ ఆరోగ్యం నిలకడగానే ఉందనీ, మరో రెండురోజుల్లో డిశ్చార్జ్ అవుతారని వారు బులెటన్ ద్వారా పేర్కొన్నారు. మరోవైపు ఈ విషయంపై రజనీకాంత్ భార్య లత కూడా స్పందించారు. రజనీకాంత్ ఆరోగ్యం మెరుగుపడిందని, నిలకడగానే ఉన్నారని అభిమానులకు ఆమె తెలియజేశారు. రజనీకాంత్ నటించిన 'వెట్టయాన్' సినిమా ఈ నెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిగాక 'కూలీ' అనే సినిమా కూడా చేస్తున్నారాయన.

# కాంతార ప్రీక్వెల్‌లో మోహన్‌లాల్



రిషబ్‌శెట్టి హీరోగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అపూర్వ విజయాన్ని సాధించింది. డివోషనల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార-1' తెరకెక్కుతున్నది. 'కాంతార'కు ముందు జరిగే కథతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ కీలక పాత్రలో నటించనున్నారని తెలిసింది.

# షరతులు లేని ప్రేమకు దర్పణం

'కె.బాలచందర్, కె.విశ్వనాథ్, దాసరి, కమల్‌హాసన్ లాంటి గొప్పవారికి మనం థాంక్స్ చెప్పుకోవాలి. ఎందుకంటే.. చిన్నప్పుడే ఈ తరహా సినిమాలను మనకు వారు చూపించేశారు. ఈ కైండ్ ఆఫ్ సినిమాను మన లోపల పెట్టారు. ఇలాంటి ఎమోషన్స్‌ని మిస్ అవుతున్నామని, మళ్లీ ఆ ఎమోషన్స్‌ని తీసుకొచ్చారని అందరూ అంటుంటే చాలా ఆనందంగా ఉంది. షరతులు లేని ప్రేమను తెరపై ఆవిష్కరించిన డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌ని అభినందించకుండా ఉండలేకపోతున్నా' అని హీరో కార్తీ అన్నారు. ఆయనా, అరవిందస్వామి లీడ్ రోల్స్ చేసిన చిత్రం 'సత్యం సుందరం'. '96'ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో జ్యోతిక, సూర్య నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ




భాషల్లో గత నెల 28న విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఇంకా దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్, హీరోయిన్ శ్రీదివ్య, రచయిత రాకేందుమౌళి కూడా మాట్లాడారు.

# భిన్నమైన నాలుగు అవతారాల్లో



మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో వరుణ్‌తేజ్ పీరియాడిక్ యాక్షన్ ఎంటైర్టైనర్ 'మట్కా' ఒకటి. కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నది. నవంబర్ 14న థియేటర్లలో సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా సెకండ్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. వరుణ్ ఈ పోస్టర్‌లో రెట్రో అవతార్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లపై నడుస్తూ కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. 1958 నుంచి 1982 వరకూ అంటే.. 24ఏండ్ల పాటు సాగే పీరియాడిక్ డ్రామా ఇదని, ఇందులో వరుణ్ నాలుగు విభిన్న రూపాల్లో కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్‌రెడ్డి, తీగల, రజనీ తాళ్లూరి, నిర్మాణం: వైర ఎంటైర్టైన్మెంట్స్, ఎస్ఆర్‌టీ ఎంటైర్టైన్మెంట్స్.

# దో పత్తిలో ద్విపాత్రాభినయం

తొలిసారిగా ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'దో పత్తి'. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. దీనికి శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కనిపించనుంది కాజోల్. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకం పై కృతి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలక పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం అక్టోబరు 25న ఓటీటీల్లో విడుదల కానుంది. ఇటీవలే ఈ సినిమా విడుదలకు సంబంధించిన ఓ వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'కథ ప్రారంభంతో.. ఆట ఇప్పుడే మొదలైంది..'అనే వ్యాఖ్యను జోడించింది.



# సెట్‌లో దర్శకుడు నన్ను చెంపదెబ్బ కొట్టాడు.. నటి పద్మప్రియ

కోలికోడ్: మలయాళ చిత్ర పరిశ్రమలో హేమ కమిటీ నివేదికపై ప్రకంపనలు కొనసాగుతున్న వేళ కొన్నేళ్ల క్రితం తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు నటి పద్మప్రియ. ఓ తమిళ సినిమా సెట్‌లో దర్శకుడు తనను పబ్లిక్‌గా చెంపదెబ్బ కొట్టాడని ఆరోపించారు. కానీ, ఆ సమయంలో మీడియా అందుకు విరుద్ధంగా.. తానే దర్శకుడిని కొట్టినట్లు తప్పుగా రాసిందని పేర్కొన్నారు. మంగళవారం కేరళలోని కోలికోడ్ జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తానే దర్శకుడిని కొట్టినట్లు మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు. ఆ సమయంలో తన వాదను ఎవరూ పట్టించుకోలేదన్నారు. మహిళల అనుభవాలను తరచుగా కొట్టిపారేయడమో, వారినే తప్పుగా చూపించడమనే సమస్యకు తనకు ఎదురైన అనుభవమే ఒక నిదర్శనంగా చెప్పొచ్చని తెలిపారు. ఈ ఘటన తర్వాత దర్శకుడిని 6 నెలల పాటు సినిమాలు చేయకుండా పరిశ్రమ నిషేధించిందన్న ఆమె.. ఆ తర్వాత తానే తమిళ చిత్రాలలో పాత్రలను నిరాకరిస్తూ వచ్చానని తెలిపారు. అప్పటి వరకు తనకు సినిమా సెట్స్‌పై ఇలాంటి ఇబ్బందికర అనుభవాలు ఎదురవ్వలేదని చెప్పారు. అయితే, ఆ దర్శకుడు ఎవరనే విషయాన్ని మాత్రం పద్మప్రియ వెల్లడించలేదు. తెలుగు సినిమా 'శీను వాసంతి లక్ష్మి'తో ఆమె తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత 'అందరి బంధువయ', 'పటేల్' చిత్రాల్లో కపినించారు. మలయాళంలో ఎక్కువ సినిమాలు చేశారు.



# బంగ్లా ఆల్‌రౌండర్ షకీబ్‌కు విరాట్ స్పెషల్ 'ఫేర్‌వెల్' గిఫ్ట్ -




కాన్పూర్ వేదికగా భారత్, బంగ్లేదేశ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఓ ఆసక్తికరమైన ఘటన జరిగింది. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్‌కు స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఓ గిఫ్ట్ ఇచ్చాడు. అదేంటంటే బంగ్లాదేశ్ స్టార్ ఆల్ రౌండర్ షకిబ్ అల్ హసన్ భారత్‌తో తన చివరి టెస్టు మ్యాచ్ ఆడేశాడు. కాన్పూర్ వేదికగా భారత్, బంగ్లా మధ్య జరిగిన రెండో టెస్టు అతడికి భారత్‌తో చివరి మ్యాచ్. అయితే ఈ వేదికలో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ షకిబ్‌కు ఓ ప్రత్యేక బహుమతి అందించాడు. ఇరు జట్ల ఆటగాళ్లు మాట్లాడుకుంటున్న సమయంలో షకిబ్ దగ్గరకు వెళ్లి తాను సైన్ చేసిన బ్యాట్‌ను అతడికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఆ తర్వాత ఈ ఇద్దరు కాసేపు సరదాగా మాట్లాడుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోందిచివరి టెస్టు ఆట డౌటే!ఇటీవల టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన షకిబ్, రానున్న ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీతో వన్డే క్రికెట్‌కు చెప్పనున్నట్లు తెలిపాడు. తన సొంత మైదానం మీర్పూర్‌లో చివరి టెస్టు ఆడాలనుకుంటున్నాడు. దీనికి బీసీబీ అంగీకరించిందంటూ షకీబ్ వెల్లడించాడు. ఇటీవలే బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో దేశం తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన అతి పెద్ద వయస్కుడిగా షకీబ్ నిలిచాడు. ప్రస్తుతం జరుగుతున్న టెస్టులో 37 ఏళ్ల 181 రోజుల వయసులో షకీబ్ శనివారం మైదానంలో అడుగుపెట్టాడు. ఈ క్రమంలో మహ్మద్ రఫీక్ పేరిట ఉన్న రికార్డుని అధిగమించాడు. రఫీక్ 2008లో 37 ఏళ్ల 180 రోజుల వయసులో బంగ్లా తరఫున టెస్టు మ్యాచ్ ఆడాడు. ఇక ఓవరాల్‌గా ఇంగ్లాండ్‌కు ప్లేయర్ విల్‌ఫ్రెడ్ రోడ్స్ 1930లో 52 ఏళ్ల 165 రోజుల వయసులో చివరి టెస్టు ఆడిన అత్యంత వృద్ధ క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించాడు. అయితే షకీబ్ ఇప్పటివరకు 71 మ్యాచ్‌ల్లో 4575 పరుగులు చేసి, 242 వికెట్లు తీశాడు. మరో 8 వికెట్లు పడగొడితే 250 మైలురాయి అందుకుంటాడు. 2007లో టెస్టు అరంగేట్రం చేసిన షకీబ్ ఒకటిన్నర దశాబ్దానికిపైగా బంగ్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ క్రమంలో బంగ్లా సాధించిన అనేక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

# బంగ్లాపై సిరీస్ క్లీన్ స్వీప్ ఫైనల్‌కు చేరాలంటే



టీమ్‌ఇండియా ఎన్ని మ్యాచ్‌లు గెలవాలంటే? బంగ్లాదేశ్‌తో తాజాగా జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అయితే ఈ విజయంతో టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి ఓ ఈజీ దారి తయారైనట్లు తెలుస్తోంది. ఎలాగంటే? కాన్పూర్ వేదికగా, తాజగా బంగ్లదేశ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమ్‌ఇండియా మరోసారి అదరగొట్టింది. 2-0 పాయింట్లతో ఈ రెండు టెస్టుల సిరీస్‌ను రోహిత్ సేన క్లీన్‌స్వీప్ చేసింది. అయితే రెండో టెస్టు డ్రా అవుతుందని అనిపించినప్పటికీ, అదిరే ఆట తీరుతో మ్యాచ్‌ను ఏకపక్షం చేసేసి భారత జట్టు ఈ మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసింది. ఇదిలా ఉండగా, ఈ సిరీస్ విజయంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా తమ అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. అంతేకాకుండా వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్(డబ్ల్యూటీసీ)కు దూసుకెళ్లడానికి తన దారిని మరింత సులువుగా ఏర్పరుచుకుంది. అయితే డబ్ల్యూటీసీలో భారత్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడింది. అందులో 8 విజయాలు, 2 ఓటములు, ఒక డ్రా ఉన్నాయి. ప్రస్తుతం భారత జట్టు 74.27)తో టాప్ పొజిషన్‌లో ఉంది. ఆ మూడింటిలో గెలిస్తే చాలుమరోవైపు జూన్‌లో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ కంటే ముందు టీమ్‌ఇండియా ఎనిమిది టెస్టులు ఆడనుంది. వాటిలో మూడింట గెలిచినా కూడా ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండానే భారత జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్, అలాగే నవంబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా బోర్డర్-గావస్కర్ ట్రోఫీ (ఐదు టెస్టులు) ప్రారంభంకానున్నాయి. స్వదేశంలో కివీస్‌తో జరిగే సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేస్తే మాత్రం ఆస్ట్రేలియా సిరీస్‌తో సంబంధం లేకుండానే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుంది. అయితే స్వదేశంలో టీమ్‌ఇండియాను ఓడించడం ఏ జట్టుకైనా కష్టం. ఇదిలా ఉండగా, ప్రస్తుతం కివీస్‌జట్టు పరిస్థితి ప్రస్తుతం బాగోలేదని క్రికెట్ విశ్లేషకుల మాట. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఆ జట్టు చిత్తుగా ఓడింది. గెలుపు సంగతి పక్కనపెడితే కనీసం ఒక్క మ్యాచ్‌ను కూడా డ్రాగా ముగించలేదన్నది వారి విశ్లేషణ. ఇక రెండు రోజుల పాటు వర్షం కారణంగా ఆగిన మ్యాచ్ ఆఖరి రోజు చాలా రసవత్తరంగా సాగింది. తొలి రోజు కేవలం 35 ఓవర్లే పడి భారత్ గెలుపు కష్టమనుకున్న సమయంలో బంగ్లాను రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆలౌట్ చేసింది రోహిత్ సేన. కేవలం 95 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా మూడు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది.

# వరల్డ్ కప్ - ఇక అమ్మాయిల వంతు వచ్చేసింది



టీ 20 వరల్డ్ కప్‌లో టీమ్ ఇండియా విజయం సాధించడంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి అన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు అమ్మాయిల వంతు వచ్చింది. వారు ధనా ధన్ ఇన్నింగ్స్ ఆడేందుకు రంగం సిద్ధమైపోయింది. పూర్తి వివరాలు స్టోరీలో టీ 20 వరల్డ్ కప్‌లో టీమ్ ఇండియా విజయం సాధించడంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి అన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు అమ్మాయిల వంతు వచ్చింది. వారు ధనా ధన్ ఇన్నింగ్స్ ఆడేందుకు రంగం సిద్ధమైపోయింది. మహిళల టీ 20 వరల్డ్ కప్ గురువారమే(అక్టోబర్ 3) గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. అసలే గత కొంత కాలంగా మహిళల క్రికెట్ పంజుకుని, ఆకర్షణీయంగా మారింది. క్రికెట్ అభిమానుల దృష్టిని కూడా బాగానే ఆకర్షిస్తోంది. టీ 20ల్లో వారు ఆడే స్టేడియాలు కూడా నిండిపోతున్నాయి. టీవీ సెట్ల ముందు కూడా పర్వాలేదనిపించే సందూ లేనంత బలంగా, ఆల్‌రౌండ్ నైపుణ్యంతో బరిలోకి దిగుతోంది. కాబట్టి ఈ సారి మన అమ్మాయిలు కూడా కప్ గెలిచే అవకాశముందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇంకా ఇంగ్లాంతో ఒక్కో మ్యాచ్‌లో తలపడతాయి. లీగ్ దశలో రెండు గ్రూప్‌ల నుంచి టాప్ రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఈ సారి టీ20 ప్రపంచకప్‌నకు దుబాయ్, షార్జా మైదానాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ నెల 20న దుబాయ్‌లో ఫైనల్ పోరు జరగనుంది. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్ ఉన్నాయి. ఈ రెండు జట్లు ఈ నెల 6న తలపడనున్నాయి




తెలంగాణ
శాసనసభ
తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

|| బుధవారం 02 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

# జిల్లా కలెక్టర్లతో

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, అక్టోబర్ 1, ఇబ్రహీంపట్నం శాసనసభ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రయోగాత్మకంగా ఈ నెల 3వ తేదీ నుండి పైలెట్ ప్రోగ్రామ్ కింద చేపట్టనున్న ప్రయోగాత్మక సర్వేను పక్కాగా జరిపించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే, నగరాలు, పట్టణ ప్రాంతాల విస్తరణకై ప్రతిపాదనలు, భూముల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల సత్వర పరిష్కారం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి, సీ.ఎస్ శాంతికుమారి సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిజిటల్ కార్డుల జారీకై ప్రతి అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో రెండు గ్రామాలలో ప్రయోగాత్మక సర్వే నిర్వహించాలన్నారు. అర్బన్ నియోజక వర్గాలైతే రెండు వార్డులు/డివిజన్లను ఎంపిక చేయాలని సూచించారు. ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించాలని, ఈ నెల 8వ తేదీ నాటికి సర్వేను పూర్తి చేయాలని అన్నారు. 9న స్క్రూటినీ జరిపి, 10వ తేదీన సర్వేకు సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదిక పంపించాలని కలెక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా సర్వేను పకడ్బందీగా జరిపించాలని, ఆర్డీఓ/జోనల్ కమిషనర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి క్షేత్రస్థాయిలో సర్వే తీరును నిశితంగా పరిశీలన చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఫ్యామిలీ ఫోటోను సేకరించడం తప్పనిసరి కాదని, ఫోటో కోసం ఎవరిని కూడా ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి రోజు ఒక్కో బృందం 30 నుండి 40 కుటుంబాలకు సంబంధించిన సర్వేను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకుని, గడువు లోపు పైలెట్ సర్వేను పూర్తి చేయించాలని అన్నారు. ఆయా ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ది పొందేందుకు సామాన్య ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ డిజిటల్ కార్డులను జారీ చేయనున్నందున ఇంటింటి పరిశీలనను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పైలెట్ సర్వే పూర్తయిన మీదట రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పైలెట్ సర్వే ప్రక్రియను తీరును పరిశీలించేందుకు ఒక్కో ఉమ్మడి జిల్లాకు ఒక స్పెషల్ ఆఫీసర్ చొప్పున రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాలలో పర్యటిస్తారని అన్నారు.భూముల క్రమబద్దీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తేవాలని, నిబంధనలకు లోబడి ఉన్న దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను దసరా కానుకగా అర్హులైన వారికి కేటాయించేందుకు గాను లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన విధివిధానాలను ఒకటి రెండు రోజుల్లోనే పంపిస్తామని, ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ కోసం విరివిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ఈ నెల 15వ తేదీ నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని తప్పనిసరి ప్రారంభించాలని, ధాన్యం దిగుబడులను అనుసరిస్తూ అన్ని ప్రాంతాలలో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ వర్తింపజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలోనూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి సమస్యలు, ఇబ్బందులకు తావు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్,డిపిఓ సురేష్ మోహన్, ఆర్డీఓలు సాయిరాం, అనంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ..

## టోక్యోలో ఆ కంపెనీ సందర్శించిన భట్టి



దేశానికి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ మారనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీని స్థాపించడానికి జపాన్‌కు చెందిన యమనాషి కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య సహకార ప్రయత్నంతో తెలంగాణ హరిత భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోంది.విదేశీ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం జపాన్ రాజధాని టోక్యో నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న యమనాషి గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని తాజాగా సందర్శించారు. అక్కడి అత్యాధునిక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్రక్రియలు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లు, ఇతర పునరుత్పాదక ఇంధన సాంకేతికతలపై చర్చిస్తూ కేంద్రంలోని శాస్త్రవేత్తలు, అధికారులతో డిప్యూటీ సీఎం నిమగ్నమయ్యారు. ఆయన వెంట ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఉన్నారు.భారత్ థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధనం వైపు వెళుతున్నందున, ఈ పరివర్తనలో తెలంగాణ ముందంజలో ఉందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సోలార్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. తెలంగాణాలోనూ ఇలాంటి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌లను నెలకొల్పేందుకు తక్షణం సన్నాహాలు చేయాలని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పుష్కలమైన నీటి వనరులు, సోలార్ ప్లాంట్‌లకు అనువైన ప్రదేశాలున్నాయని చెప్పారు. దేశంలో గ్రీన్ హైడ్రోజన్‌కు తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రతిపాదనలను వెంటనే రూపొందించాలని తన బృందానికి సూచించారు.అదేవిధంగా యమనాషి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ అభివృద్ధి చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) యూనిట్‌ను కూడా డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ సాంకేతికతను సింగరేణి సోలార్ ప్లాంట్‌లకు, అలాగే అదనంగా 1,000 మెగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు ప్రణాళికాబద్ధంగా ఉపయోగపడుతుందని భట్టి పేర్కొన్నారు. యమనాషి అధికారులతో చర్చల సందర్భంగా తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు, బీఈఎస్ఎస్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు జాయింట్ వెంచర్‌ను ఆయన ప్రతిపాదించారు. దీనిపై యమనాశి అధికారులు సానుకూలంగా స్పందించి తదుపరి చర్యలు చేపట్టారని ప్రకటించారు.

## ‘సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అంటే ఇదేనా?’ :

# కేంద్రంపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ కు బీజేపీ అన్నిట్లో మొండిచెయ్యి చూపిస్తోందని బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు విడుదల చేసిన వరద సహాయంపై హరీష్ రావు స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు జరిపే అన్ని కేటాయింపుల్లో గుండుసున్నాలేనని మండి పడ్డారు.

3లో

## దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన : పానుగంటి శ్రీకాంత్

ఎన్ ఎస్ యు ఐ సోషల్ మీడియా జాతీయ కోఆర్డినేటర్



**దేవరకొండ అక్టోబర్ 01శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఢిల్లీ యూనివ్సిటీ స్టూడెంట్ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి నాయకత్వంలో ప్రచారం ముగించుకొని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన పూల మొక్క బహుకరించిన ఎన్ ఎస్ యు ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్. దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ ఢిల్లీ యూనివ్సిటీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవరకొండ ప్రాంతం నుండి వెళ్ళి ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలలో ప్రకారం చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగటి హరీష్, పంబాల పర్వతాలు, కుంభం రామకృష్ణ గౌడ్, నీలం ఆంజనేయులు యాదవ్, ఈద నాగరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు



**చండూర్ అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ :** చండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, బతుకమ్మలను అందంగా పేర్చి సంస్కృతి సంప్రదాయాలతో "సిత్తు సిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ" అంటూ పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల.బిక్షం మాట్లాడుతూ రంగురంగుల పూలతో ప్రకృతి ఆరాధించే పూల పండుగే బతుకమ్మ పండుగ.తొలి రోజు ఎంగిలి పువ్వు బతుకమ్మ మొదలై చివరి రోజు సద్దుల బతుకమ్మ పండుగ తో వేడుకలు ముగుస్తాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాల్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యలి

**యాచారం, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల తెలిపిన వివరాల యాచారం మండలం నల్లవెల్లి తండాకు చెందిన భాస్కర్ గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ అప్పుల బాధ తాళలేక మనస్థాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకోవడం జరిగినది. మృతుని భార్య జరుపుల పద్మ ఫిర్యాదు మేరకు యాచారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి జరుపుతున్నట్లు యాచారం సీఐ శంకర్ కుమార్ తెలిపారు.



## గురునానక్ విద్యాసంస్థలో జాతీయ స్థాయి అండర్ 25 సమ్మిట్ కార్యక్రమం






**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** రంగ రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్య సంస్థలు, యూనివర్సిటీ సంయుక్తంగా జాతీయ స్థాయి "అండర్ 25 సమ్మిట్" ని మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం విద్యార్థులు వారి వారి నిర్దిష్ట డొమైన్‌కు మాత్రమే పరిమితం కాకుండా పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుని వారిలో ఉ న్నటువంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నూతన ఆవిష్కరణలను ఆవిష్కరింప చేసే దిశగా వారిని తీర్చి దిద్దే వేదికగా నిర్మాణం చేయడం. కార్యక్రమంలో యువ ప్రతిభావంతులైన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడం జరిగింది. సదస్సుకు అతిధులుగా శ్రీ అరవింద్ కృష్ణ, ప్రముఖ అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు మరియు చలనచిత్ర నటుడు, మరియు వర్ధమాన యువ నేపథ్య గాయకులలో ఒకరైన కునాల్ కిషోర్ తన గాత్రం తో విద్యార్థులను అలరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయడంతోపాటు విజయవంతమైన కెరీర్‌కు వ్యూహాలను ఎలా రూపొందించుకోవాలి వాటిని అమలు చేసే విధంగా ఏవిదంగా సన్నద్ధం కావాలి అనే అంశాలపై వివరణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్ జీఎస్ కోహ్లి, విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ ఎస్ సైని మాట్లాడుతూ, అతిథులుగా విచ్చేసిన క్రీడారంగా చలన చిత్ర రంగానికి సంబందించిన వారికి అభినందనలు తెలుపుతూ విద్యార్థులు వారి వారి కెరీర్ లో ఉన్నత విజయాలు సాధించేలా అందుకు అనుగుణంగా వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించి భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించే దిశగా తమ సంస్థ అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులు మరో మైలు రాయిని చేరుకొని తమ లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకట రావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పార్థసారదే, మిస్టర్ వినయ్ చోప్రా, డైరెక్టర్ కార్పొరేట్ రిలేషన్స్ ఇతర విభాగ అధిపతులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్న మోడీ ప్రభుత్వం : సభ్యులు నారి ఐలయ్య ,

### సిపీఎం రాష్ట్రా కమిటీ సభ్యులు






**దేవరకొండ అక్టోబర్ 01 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** కార్పొరేట్ శక్తులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని పేదలను విస్మరిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు,మంగళవారం వారం రోజున నేరేడుకొమ్ము మండలంలోని పేర్వాల కేతపల్లి గ్రామాలలో జరిగిన సిపిఎం శాఖ మహాసభలకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని తెలిపారు,దేశంలోని మతోన్మాద శక్తులు బిజెపి దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండటం వల్ల మైనార్టీ మతాలపై రోజురోజుకు తీవ్రమైన దాడులు పెరుగుతున్నాయని అన్నారు పెట్టుబడిదారులకు అనుకూలమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని వారు విమర్శించారు.రాష్ట్రంలో అధికారులకు వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కూలీలక సంవత్సరానికి 12,000 రూపాయల ఇస్తామని చెప్పి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని విద్యా ఉద్యోగ నియమకాలను పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని తెలియజేశారు.గ్రామాల్లో పట్టణాల్లో ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తుంది, ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో పట్టణాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు.ఈ మహాసభలలో పార్టీ మండల కార్యదర్శి నాగటి నాగరాజు, ఎడ్ల కాశయ్య,ధనయ్య.వెంకటయ్య. ఇందిరా,లక్ష్మమ్మ, మూడవత్ జమురు నాయక్, కేతావత్ దర్గా నాయక్. మూడవత్ వానిమీ బాయ్. చంద్రు నాయక్. లాలూ నాయక్ .లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. పేర్వాల గ్రామ శాఖ కార్యదర్శిగా ఎడ్ల కాశయ్య కేతపల్లి గ్రామ కార్యదర్శిగా మూడవత్, జమురు నాయక్ ఎన్నికయ్యారు.

## గీతావిద్యాలయంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు




**చండూర్ అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ :** 2024 -25 సంవత్సరానికి గాను ఫస్ట్ టర్మ్ హాలిడేస్ ప్రారంభం కానునందున ఒకరోజు ముందే చండూరు గీతా విద్యాలయంలో విద్యార్థినీ విద్యార్థులు ఆశ్వయుజ మాసంలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు,మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలతో ఆటలాడి బతుకమ్మ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ పోలోజు నరసింహ్మాచారి మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత బతుకమ్మ పండుగ యొక్క ప్రాధాన్యత మరియు ఆదరణ మరింత పెరిగిందని చోళరాజు ధర్మాంగదుని యొక్క కూతురే ఈ బతుకమ్మని గౌరీదేవిగా, లక్ష్మీదేవిగా తెలంగాణలో ఈ పండుగ జరుపుకోవడం వెనక వేల ఏండ్ల చరిత్ర ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

## సెయింట్ మేరీ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- ముందస్తుగా బతుకమ్మ సంబరాల్లో విద్యార్థిని, విద్యార్థులు
- ఆనందం వ్యక్తం చేసిన కుర్మెడుపాఠశాల ప్రిన్సిపల్ జహంగీర్, పాఠశాల సిబ్బంది.



**చింతపల్లి, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండలం కురుమేడు గ్రామంలోని సెయింట్ మేరీ పాఠశాలలో విజయదశమి సందర్భంగా స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా పాఠశాల యాజమాన్యం బతుకమ్మ సంబరాలు విద్యార్థులచే వివిధ కళారూపాలతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జహంగీర్ మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా ముందస్తుగా విద్యార్థిని విద్యార్థులచే బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని తెలుపగా మంగళవారం నిర్వహించారు. పాఠశాల నిర్వహణకు సాయ శక్తులా కృషి చేస్తూ చింతపల్లి మండల పరిసర ప్రాంతాల విద్యార్థుల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల ప్రతిభ అమోఘంగా ఉందని విజయదశమి సందర్భంగా ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆశీర్వదించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుమేటి కవిత, మాధురి, నాగిళ్ల జ్యోతి, దేని నిమ్మి, ఏకుల జ్యోతి,ఏకుల అపర్ణ తదితరులు పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రిన్సిపాల్ జహంగీర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## గాంధీజీలో ఇంగ్లీష్ మీడియంలో ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు




**చండూర్ అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ :** చండూరు మున్సిపాలిటీ పరిధిలో గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధించే పెద్ద పండుగని, తెలంగాణ రాష్ట్రంలో సంస్కృతి, నాగరికత, సాంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకునే పూల పండుగే బతుకమ్మని, ప్రపంచ దేశాల్లో ఉండే తెలుగు వారందరూ జరుపుకునే పూల పండుగే బతుకమ్మని, ప్రపంచ దేశాల్లో ఉండే తెలుగు వారందరూ ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. పూలు బాగా వికసించే కాలంలో, జలవనురులు సమృద్ధిగా పొంగే వర్షాకాలం చివరలో, శీతాకాలం ప్రారంభంలో ఈ బతుకమ్మ పండుగ వచ్చి భూమితో, జలంతో మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోపడుతుందని, రకరకాల పువ్వులు గానుగ పూలు, తంగేడు పూలు, బంతి, చామంతి పూలు, జిల్లేడు పూలు, గడ్డి పూలు కలిపి బ్రతకమ్మను పేర్చి, శిఖరం లేదా సిగ మీద గుమ్మడి పువ్వు ను వుంచి పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. ఈ పూల పండుగ ఎంగిలిపువ్వు బతుకమ్మతో మొదలుపెట్టి సద్దుల బతుకమ్మతో ముగిసిపోతుందని తెలిపారు. తదుపరి పాఠశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలను పెట్టి, బతుకమ్మ పాటలు పాడి, కోలాటాలు ఆడి, నృత్యాలు చేసి బతుకమ్మ పండుగను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అంటే ఇదేనా?' : కేంద్రంపై మండిపడ్డ హరీష్ రావు



తెలంగాణ ప్రజలు బీజేపీకి రాష్ట్రం నుండి 8 సీట్లు ఇస్తే రాష్ట్రానికి కేంద్రం ఒరగబెట్టింది మాత్రం శూన్యం అన్నారు.కేంద్ర బడ్జెట్లో ఏమీ ఇవ్వలేదు, స్టేట్ స్పెసిఫిక్ గ్రాంట్లలో మొండిచెయ్యి ఇచ్చిందని పేర్కొన్నారు.ఇక వరద సహాయం కింద ఇచ్చే ఎన్డీఆర్ఎఫ్ని ధుల్లో పక్కనున్న ఏపీతో పోల్చుకుంటే సగం కంటే తక్కువే కేటాయింపులు చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఊదరగొట్టే సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అంటే ఇదేనా? అని కేంద్రాన్ని హరీష్ రావు నిలదీశారు. ఈ మేరకు హరీష్ రావు తన ఎక్స్ ఖాతా వేదికగా పోస్టు పెట్టారు.

## సన్ షైన్ పాఠశాలలో ఘనంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ సంబరాలు






**చండూర్, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ :** స్థానిక సన్ షైన్ పాఠశాలలో ఎంగిలి పువ్వు బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ కలిసి తీరొక్క పువ్వును సేకరించి వాటి గురించి వివరిస్తూ బతుకమ్మను పేర్చి ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దుర్గాదేవి నవ రూపాలను ప్రదర్శిస్తూ అద్భుతమైన నృత్య ప్రదర్శన చేశారు. అదేవిధంగా బతుకమ్మ పాటలతో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయురాల్లు అందరూ కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ పువ్వుల యొక్క విశిష్టతను తెలియజేస్తూ బతుకమ్మ కార్యక్రమాల ద్వారా పిల్లల్లో తమ తోటి వారితో కలిసిమెలిసి ఉండడం ద్వారా సమాజ స్పృహ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నగరవాసులను వణికిస్తున్న ఆర్బీ-ఎక్స్ గుర్తు




**హైదరాబాద్ / శాసనసభ ప్రతినిధి :** హైదరాబాద్ నగరవాసులు ప్రస్తుతం బుల్డోజర్ శబ్దం విన్నా.. కాలనీల్లో జేసీబీలను చూసినా వణికిపోతున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలకు సమీపంలో ఉండే ఇళ్ల యజమానులకైతే నిద్ర కూడా పట్టటం లేదు.చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుండటంతో వారి గుండెల్లో రైళు పరుగులు పెడుతున్నాయి. తాజాగా.. నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారికి కొత్త భయం పట్టుకుంది. ఆర్బీ-ఎక్స్ గుర్తు చూస్తే చాలా ఆయా ప్రాంతాల్లోని నగరవాసులు వణికిపోతున్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన గౌని జంగయ్య

**చింతపల్లి, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మార్కెట్ కమిటీ డైరెక్టుగా నియమితులైన గౌని జంగయ్యకు కురుమేడు గ్రామంలో మంగళవారం రోజు ఉప్పు శ్రీశైలం ఆధ్వర్యంలో ఆయనకు శాలువాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ కురుమేటి బజారు,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్రి కృష్ణయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్మేటి అభిలాష్, గాడ సంఘం అధ్యక్షులు గౌని రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల జంగయ్య,అనంతుల వెంకటయ్య,చేపూరి వెంకటేష్,చిక్కొండ సాయిరాం,కుర్మేటి రామకృష్ణ,ఏకుల జంగయ్య,షఫీ,పోలమోని శేఖర్,బుర్రి యాదయ్య, ముద్దం శేఖర్,కుర్మేటి



రాములు,గునిగంటి యాదయ్య,మల్లోజు రాజేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరాలంటే కష్టపడి చదవాలి

## - మండల విద్యాధికారి శ్రీనివాస్







**మర్రిగూడ, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రగండ్లపల్లిలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి శ్రీనివాస్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరాలంటే కష్టపడి చదవాలని ఈరోజు శ్రమిస్తే రేపు భవిష్యత్ తరాలకు విద్యార్థులు బాటలవుతారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. 2003 2004 పూర్వ విద్యార్థుల సహకారం తో ఎన్ ఎం ఎంఎస్ స్కాలర్షిప్ కోసం విద్యార్థులు పోటీపడి టాలెంట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు గురువులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులు అవసరం కోసం ఇక్కడ పాఠశాలలో పూర్వ విద్యార్థులుగా చదివి ఇప్పటి విద్యార్థుల కోసం బుక్స్ అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులకు జామెంట్రీ బాక్స్ అందించడం అభినందనీయమని పూర్వ విద్యార్థులు అయినా 2003 2004 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో గుర్తుంచుకొని విద్యార్థుల కోసం ఇలాంటి ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కోసం వారు మరింత తోడ్పాటు అందించాలని ఆయన అన్నారు పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా నేను ఈ పాఠశాలలో చదువుకొని నా మిత్రుల సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం చేయూతనందించడం సంతోషంగా ఉందన్నారు విద్యార్థులు మాదకద్రవ్యాలకు విష సంస్కృతికి దూరంగా ఉండి లు కల్చర్ కు దూరంగా ఉండి బుక్ కల్చర్ను అలవాటు చేసుకోవాలని తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నమ్మకాలను వమ్ము చేయకుండా సంస్కారం లేని స్నేహాన్ని వీడి సమాజ మార్పు కోసం విద్యాభివృద్ధి తో పాటు మీ జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, బాబాసాహెబ్ అంబేద్కర్ దేశం కోసం ఉరికంబం ఎక్కిన యువకిశోరం భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని నవ సమాజ నిర్మాతలుగా సమాజ మార్పు కోసం పాఠశాల అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధి కోసం విద్యార్థి దశనుండే విద్యార్థులు ప్రయత్నం చేయాలని అన్నారు అర్ధ నగ్న చిత్రాలు అశ్లీల దృశ్యాలు యువతను పెడదోవ పట్టించే విధంగా సినిమా కల్చర్ ర్యాగింగ్లు రోజురోజుకు పెరుగుతున్నాయని వాటి నరికట్టడంలో యువత విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని మనల మనమే రక్షించుకోవాలని అందుకోసం జ్ఞానం అని ఆయుధంతో ఈ సమాజాన్ని జయించాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కోరారు అనంతరం విద్యార్థులకు జామెంట్రీ బాక్స్ ఎన్ ఎం ఎం ఎస్ బుక్స్ అవసరమని చెప్పగానే తక్షణమే స్పందించి సహకారాన్ని అందించిన పూర్వ విద్యార్థులందరికీ పి ఆర్ ఆర్ ఫౌండేషన్ మరియు పాఠశాల విద్యార్థుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే భవిష్యత్తులో మా పూర్వ విద్యార్థులుగా మరింత పోసాని కూడా అందిస్తామని వారు అన్నారు అనంతరం తన దగ్గర లేకున్నా పురోహితం చేసుకుంటూ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం సాయంత్రం తన సొంత డబ్బులతో స్నాక్స్ ను అందిస్తున్న మంచన హరిబాబు పి సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి ఉపాధ్యాయులు ఎం మూర్తి శ్రీనివాస్ రెడ్డి ఉదయశ్రీ జ్యోతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాది పేద ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం



**హైదరాబాద్,శాసనసభ ప్రతినిధి :** మా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో డిసెంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ప్రభుత్వ నిర్ణయాలు క్లారిటీగా చెప్పారని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.ఇవాళ మంత్రి మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా, మూసీ లాంటి కార్యక్రమాల గురించి చెప్పారని, పేద,మధ్యతరగతి కుటుంబ అవసరాలు తెలుస్కొని అవి తీర్చడానికే మా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మాది పేద ప్రజల కోసం పని చేసే ప్రభుత్వమని, మూసీ నది ప్రక్షాళన పై బిఆర్ఎస్ పార్టీ వారు ఆరోపణలు చేస్తున్నారని, బీఆర్ఎస్ హయంలోనే మూసీ రివర్ డెవలప్మెంట్ 2017 లో జీవో నెంబర్ 90 ద్వారా కార్పొరేషన్ ఏర్పాటు చేసారన్నారు శ్రీధర్ బాబు. అక్రమ కట్టడాలు లెక్క తీయాలని,రివర్ బెడ్ బఫర్ జోన్ ఫిక్స్ చేయాలని అందులో పేర్కొన్నారని, అప్పటి మీటింగ్ మినిట్స్ లో చాలా స్పష్టంగా ఉన్నది. అక్రమ కట్టడాలు ఎలా తొలగించాలి అని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా..'2020 జూన్ 27 న అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ మీటింగ్ ఏర్పాటు చేసి..బఫర్ జోన్,మూసీ మాస్టర్ ప్లాన్ పై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు సుమారు 15వేల డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నారు. బఫర్,ఎఫ్టీఎల్ నిర్ధారణ చేసి అక్రమ కట్టడాలు కూల్చేయాలని నిర్ణయం తీసుకున్నారు. జీవో నెంబర్ MS 7 ద్వారా 50 మీటర్ల వరకు బఫర్ జోన్ గా గుర్తించాలని 2016 లోనే చెప్పారు. మూసీ ఒడ్డున చదర్ఘాట్ ప్రాంతంలో వర్షంతో ఇళ్లలోకి నీళ్ళు వచ్చాయి. మూసీ మాక్సిమం ఫ్లడ్ లెవల్ 1లక్ష 50వేలు క్యూసెక్కులు..ఇరిగేషన్ ఇంజనీర్ వాళ్ళు చెప్పినవి. బీఆర్ఎస్ ఆలోచన చేస్తే మంచి కార్యక్రమం..మేము చేస్తే మంచి కార్యక్రమం కాదా..? హైదరాబాద్ విశ్వనగరం పేరుకే కాదు..అట్లా ఉండాలని ముందుకు వెళ్తే బిఆర్ఎస్ బురద జల్లుతుంది. మీరు చేస్తే ఒప్పు..మేము చేస్తే తప్పు అవుతుందా..? మీరు మంచి సూచనలు,సలహాలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరిస్తుంది. కానీ బిఆర్ఎస్ దీన్ని రాజకీయం చేస్తూ సమస్యను జటిలం చేస్తున్నారు. కాళేశ్వరం,మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో అప్పుడు ఎందుకు మీరు మానవత్వం చూపెట్టలేదు.' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

## - కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను దృష్టికి తీసుకువస్తే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు.

# ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు




**చండూర్, అక్టోబర్ 1 శాసనసభ న్యూస్ :** స్థానిక చండూరు పట్టణంలో గల కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంతో తెలంగాణ సాంప్రదాయ దుస్తులలో పాల్గొని బతుకమ్మను పేర్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు బతుకమ్మ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కె మహబూబ్ అలీ, ఇన్చార్జి స్వప్న, అకౌంటెంట్ సరిత, వైస్ ప్రిన్సిపల్ మిల్కీ రాజు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ
తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు
సేకరించడానికి విలేకరులు కావలెను.
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు
నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు
నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు, నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.
తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్
సెల్: 9949360937,9100900931